సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 12 । జులై । 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్ఠంగా రూ.20 వేలు, కనిష్ఠం రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.45

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ఠంగా రూ.45, కనిష్ఠం రూ.32 మేర ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.2°/21.9°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసరాలు



బియ్యం, కందిబేడల నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం అర్బన్: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రజలకు రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, కందిబేడలు అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలోని రైతు బజార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు పంపిణీ కేంద్రాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం బియ్యం, కందిబేడలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కందిపప్పు కిలో రూ.160, బియ్యం (రా వెరైటీ) కిలో రూ.48, బియ్యం (స్టీమ్ వెరైటీ) కిలో రూ.49 ప్రకారం ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, రెవెన్యూ అధికారులు, ధర్మవరం కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతన్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ శుభాకాంక్షలు



కలెక్టర్ చేతన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ

పుట్టపర్తి అర్బన్: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టీఎస్ చేతన్‌ను ఉమ్మడి అనంతపురం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం స్థానిక సాయి ఆరామంలో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి విచ్చేసిన ఆమె... కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆమె వెంట జెడ్పీ సీఈఓ వైఖోం నిదియాదేవి ఉన్నారు.

ఆరుగురు ఏఎస్‌ఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ఆరుగురు ఏఎస్‌ఐలను బదిలీలు చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఆరుగురికి పోస్టింగ్ ఇచ్చారు. ఎస్.నరసింహులును పెనుకొండ, ఎస్.కే. మునే నాయక్‌ను ఎన్‌పీకుంట, బి. చంద్రశేఖర్‌ను కదిరి టౌన్ పీఎస్, జి. వెంకటరమణను 'కియా' పోలీస్‌స్టేషన్,కె. మధుసూదన్‌ను గోరంట్ల యూపీఎస్, డి. మల్లికార్జునను మడకశిర పీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

డిగ్రీ ప్రవేశాల గడువు పొడిగింపు

ధర్మవరం అర్బన్: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ వరకూ గడువు పొడిగించారు. విద్యార్థులు 20వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 23 నుంచి 26వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

నేటి నుంచి 'యంగ్ అడల్ట్స్' సదస్సు



సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: మరో అంతర్జాతీయ సదస్సుకు ప్రశాంతి నిలయం వేదిక కాబోతోంది. సాయికుల్వంత్ సభా మందిరంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'యంగ్ అడల్ట్స్' సదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి సత్యసాయి యూత్ వింగ్ సభ్యులు తరలివస్తున్నారు. భారత మాజీ క్రికెటర్ దినేష్ కార్తిక్ సదస్సులో పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత వేద పఠనంతో సదస్సు ప్రారంభం కానుంది. సత్యసాయి యూత్ సంస్థల సభ్యులు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తల్లికి వందనం.. ఎగనామం!





'మేం అధికారంలోకి వస్తే అమ్మ ఒడి బదులు 'తల్లికి వందనం' పేరుతో ఇంట్లో ఎందరు ఉంటే అందరు విద్యార్థులకూ ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తాం' అంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఊదర గొట్టారు. అయితే, ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు స్వీకరించి నేటికి నెల గడిచినా, 'తల్లికి వందనం' పథకం అమలుకు నోచుకోలేదు. గత నాలుగేళ్లూ పాఠశాలలు పునఃప్రారంభమైన వెంటనే తల్లుల బ్యాంకు ఖాతాల్లోకి 'అమ్మ ఒడి' డబ్బులు జమ కావడం గమనార్హం.

- కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కొక్కరికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు
- నేడు ఎంతమందికి ఇస్తారో స్పష్టత ఇవ్వని వైనం
- ప్రతి తల్లికీ అంటూ కొత్తరాగం
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై విమర్శలు
- నగదు ఎప్పుడు.. ఎంత ఇస్తారో తెలీక తల్లిదండ్రుల అవస్థలు
- ఫీజులు కట్టాలని డిమాండ్ చేస్తోన్న ప్రైవేటు స్కూళ్ల నిర్వాహకులు
- గత ప్రభుత్వంలో ఇలాంటి సమస్య ఎప్పుడూ లేదంటోన్న లబ్ధిదారులు

ప్రభుత్వ పాఠశాలలు	2,078
విద్యార్థులు	1,47,000
ప్రైవేటు పాఠశాలలు	430
విద్యార్థులు	80,000
జూనియర్ కళాశాలలు	113
విద్యార్థులు	10 వేలు

అమ్మ ఒడి ద్వారా గత ప్రభుత్వంలో చేకూరిన లబ్ధి

విద్యా సంవత్సరం	విద్యార్థులు	లబ్ధి
2019- 20	1,62,574	రూ.243.86 కోట్లు
2020 - 21	1,61,554	రూ.242.33 కోట్లు
2021 - 22	1,66,398	రూ.249.60 కోట్లు
2022 - 23	1,62,080	రూ.210.10 కోట్లు

సాక్షి, పుట్టపర్తి: ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా చంద్రబాబు కొత్త రాగం అందుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అందరికీ 'తల్లికి వందనం' ఆర్థిక సాయం అందిస్తామన్న ఆయన.. నేడు కేవలం ప్రతి తల్లికి ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని మార్గదర్శకాలు జారీ చేయడం పట్ల విద్యార్థుల తల్లులు మండిపడుతున్నారు. ప్రతి విద్యార్థికీ రూ. 15 వేలు అని కాకుండా ప్రతి తల్లికీ ఇస్తామని చెప్పడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. బాబు ఇచ్చిన హామీలు నమ్మి ఓట్లేశామని తీరా గెలిచిన తర్వాత కోతలు పెట్టేలా ఆలోచించడం సరికాదంటున్నారు.

జగన్ ప్రభుత్వం తంచన్‌గా..

పేద పిల్లలను బాగా చదువుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో దేశంలోనే మొట్టమొదటిసారిగా గత జగన్ ప్రభుత్వం 'అమ్మఒడి' పథకానికి శ్రీకారం చుట్టింది. నాలుగు విడతల్లో పథకం కింద రూ.946 కోట్లు నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఏటా సగటున 1.50 లక్షల మందికి లబ్ధి చేకూర్చారు. దీంతో పథకం విజయవంతమై డ్రాపౌట్స్ సంఖ్య భారీగా తగ్గింది. గత నాలుగేళ్లూ సక్రమంగా 'అమ్మ ఒడి' సొమ్ము జమ కావడంతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు ఫీజులను సకాలంలో చెల్లించారు.

ఆశలు అడియాసలు..

'అమ్మ ఒడి'కి ఆదరణ దక్కడంతో గత ఎన్నికల ముందు చంద్రబాబు కూడా మేనిఫెస్టోలో ఈ పథకాన్ని చేర్చడం అనివార్యమైంది. అయితే, అదే పేరున అమలు చేస్తే జగన్‌కు పేరొస్తుందనే ఉద్దేశంతో 'తల్లికి వందనం'గా మార్చుతామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వస్తే ఇంట్లో అందరికీ 'తల్లికి వందనం' పేరుతో ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇవ్వడంతో మరిన్ని డబ్బులు వస్తాయని పిల్లల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు అతీగతీ లేకపోవడంతో వారి ఆవేదన వర్ణనాతీతంగా మారింది. ప్రైవేటు ఫీజులు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. ఎంతమందికి ఇస్తారో? ఎప్పుడు ఇస్తారో? ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'తల్లికి వందనం' పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు చెల్లించాలని ఆశతో ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. ప్రస్తుతం జిల్లాలో ఒకటి నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో సుమారు 1.50 లక్షల మందిపైనే ఉన్నారు. వారందరికీ ఎంతవరకు లబ్ధి చేకూరుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు కేవలం ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేయాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలియడంతో తల్లిదండ్రులు మరింత ఆందోళన చెందుతున్నారు.

మాట తప్పుతున్న బాబు



ఎన్నికల సమయంలో ఇంటిలో ఎంత మంది ఉంటే, ఇద్దరు ఉంటే ఇద్దరికి, ముగ్గురు ఉంటే ముగ్గురికి, నలుగురు ఉంటే నలుగురికి డబ్బులు ఇస్తానని మాట ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట తప్పుతున్నారు. ఇంత కన్నా మోసం మరోటి ఉంటుందా. ప్రతి ఏటా వైఎస్ జగన్ క్రమం తప్పకుండా అమ్మ ఒడి అందించారు. నా కుమారుడు ప్రమీణ్‌కుమార్‌రెడ్డి (7వ తరగతి), కుమార్తె సుదీక్ష(4వ తరగతి) చదువుతున్నారు. ఇప్పుడు వారికి ఫీజులు చెల్లించాల్సి ఉంది. ఎలా చెల్లించాలి. అది కూడా ఇంటిలో ఒక్కరికే అంటున్నారు ఏమీ జరుగుతున్నదో? ఏమో అర్థం కాలేదు. నేను, నా భర్త ఈశ్వర్‌రెడ్డి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం.

– బి.సౌజన్య, గుమ్మళ్లకుంట గ్రామం, బత్తలపల్లి మండలం.

ఆశగా ఎదురుచూస్తున్నాం



నాకు ఇద్దరు కుమారులు. ఒకడు 9 వ తరగతి, మరొకడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద నా కుమారుడికి అప్పటి సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం సకాలంలో సాయం అందించారు. దీంతో ఇబ్బంది లేకుండా పోయింది. ఈ ఏడాది మాత్రం ఇంకా పడలేదు. తల్లికి వందనం సాయం ఇద్దరు పిల్లలకు వస్తుందని చెప్పారు. ఇద్దరికి కలిసి రూ.30 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నా. ఇస్తారని కొందరు చెబుతున్నారు. ఇవ్వరని మరికొందరు చెబుతున్నారు.

– జి. శిల్ప, లాలేపల్లి, చిలమత్తూరు మండలం

నాకు రూ. 60 వేలు రావాలి



నాకు నలుగురు సంతానం. పెద్ద కుమార్తె భవిత ఇంటర్, రెండవ కుమార్తె 10వ తరగతి, మూడవ కుమార్తె 7 వ తరగతి, నాల్గవ కుమార్తె 5 వతరగతి చదువుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పేరిట రూ. 15 వేల చొప్పున వేస్తామని చెప్పారు. నలుగురికి రూ. 60 వేలు రావాలి.

– బి.క్రిష్ణవేణి, ఉబ్బువాండ్లపల్లి, తలుపుల మండలం

ఆశలు అడియాసలేనా?



నాకు ముగ్గురు సంతానం. ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఇంటి వద్దకు వచ్చి ముగ్గురికి తల్లికి వందనం పథకం వర్తిస్తుందని, కూటమి అభ్యర్థికి ఓటేయాలని కోరారు. వారి ప్రభుత్వం రాగానే ఏడాదికి ముగ్గురికి రూ. 45 వేలు వస్తుందని, పిల్లల్ని బాగా చదివించుకోవచ్చని ఆశ పడ్డా. ప్రభుత్వం ఒకరికే అంటుండడంతో నా ఆశలు అడియాసలవుతున్నాయి. – రమణమ్మ, చీకిరేవులపల్లి, అమడగూరు మండలం

మాట నిలబెట్టుకోవాలి



గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద ఏటా బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశారు. చంద్రబాబు కూడా చెప్పిన మాట ప్రకారం చెల్లించి విద్యాభివృద్ధికి కృషి చేయాలి. పాఠశాల తెరిచి నెల రోజులవుతున్నా ఖాతాలోకి జమ కాలేదు. తల్లికి వందనం నిధులు ఎప్పుడు జమ చేస్తారా అని చూస్తున్నాం. నా కుమార్తె లక్ష్మి 5వ తరగతి, కుమారుడు దిలీప్‌కుమార్ 2వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు. నా ఖాతాలో రూ.30 వేల నగదు జమ చేయాలి.

– మంజుళ, ఏఆర్ రొప్పం, మడకశిర మండలం

ఇంకెన్నాళ్లు వేచి చూడాలి



నాకు ఇద్దరు సంతానం. రోజూ కూలి పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివించుకుంటున్నాం. తల్లికి వందనం పథకానికి సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఒకవేళ తల్లికి వందనం పథకం ద్వారా ముగ్గురికీ పథకం వర్తించదని తెలిస్తే పిల్లలకు ఎలాంటి భవిష్యత్తు ఇవ్వాలో అర్థం కావడం లేదు. గతంలో ఏనాడూ దిగులు చెందలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టమైన ఆదేశాలతో మాకు భరోసా కల్పించాలని కోరుతున్నాం.

– చంద్రకళ, శ్రీరంగరాజుపల్లి, పరిగి మండలం

అందరికీ వర్తింపజేయాలి



చదువుకుంటున్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తింపచేయాలి. నాకు ఒక కూతురు, కొడుకు ఉన్నారు. వీరిలో కూతురు (అక్షిత) లేపాక్షి రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో 6వ తరగతి చదువుకుంటోంది. కుమారుడు (హర్షవర్ధన్) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలు తెరిచి నెల రోజులవుతున్నా ఇంకా తల్లికి వందనం పథకం డబ్బులు రాలేదు. గతంలో అయితే పాఠశాలలు తెరిచిన కొన్ని రోజులకే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేసేవారు.

– వరలక్ష్మి, కనగానపల్లి

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దాం





అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు సత్యకుమార్, సవిత, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు, సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం
- మంత్రులు సత్యకుమార్, సవిత
- పుట్టపర్తిలో మొదటి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం

పుట్టపర్తి అర్బన్: అందరూ సమష్టిగా పని చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిద్దామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో కలెక్టర్ చేతన్ అధ్యక్షతన మొదటి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ పార్థసారథి, పుట్టపర్తి, మడకశిర ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్ రాజు, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్ కుమార్, జెడ్పీ సీఈఓ వైఖోం నిదియాదేవి, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ జిల్లాలో వనరులకు కొదవ లేదని, సద్వినియోగం చేసుకొని జిల్లాను అభివృద్ధి పథంలో నడపాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రజా సంక్షేమానికి పాటు పడాలన్నారు. ఉద్యోగులకు అలసత్వం పనికి రాదన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధుల విడుదలకు కృషి చేస్తానన్నారు. వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలు తమపై పెద్ద నమ్మకాన్ని పెట్టుకున్నారన్నారు. సీఎం మొదటి సంతకం చేసిన డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. సంపద సృష్టించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఎంపీ పార్థ సారథి మాట్లాడుతూ గొల్లపల్లి నుంచి పెనుకొండకు నీరు అందించేందుకు రూ.320 కోట్ల నిధులు విడుదలైనా, ఎందుకు టెండర్లు పిలవలేదని ప్రశ్నించారు. పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. రొద్దం, కొత్తచెరువు, రత్నగిరి, రామాపురం, రొళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మాట్లాడుతూ చిత్రావతి నదిలోకి మురుగు నీరు వదలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ ప్రతి శాఖ హెచ్‌ఓడీకి తమ శాఖపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఏ పథకాలకు ఎంత బడ్జెట్ అవసరమో తెలపాలన్నారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అన్ని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తామని, అన్ని వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధం



జనాభా దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రులు, కలెక్టర్

- పుట్టపర్తిలో ఘనంగా జనాభా దినోత్సవం
- ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్, జిల్లా మంత్రులు

పుట్టపర్తి అర్బన్: జనాభా పెరుగుదల అభివృద్ధికి అవరోధమని మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద మంత్రులు, కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 'తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డబిడ్డకూ అంతరం అన్న లక్ష్యంతో కుటుంబ ప్రణాళిక అనేది కొత్త గుర్తింపు, దంపతులకు గర్వకారణం' అన్న నినాదంతో ఈ సంవత్సరం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదరికాన్ని పారదోలడం, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపర్చడం, విద్య ఆరోగ్య సంరక్షణ, మహిళలు, బాలికలకు సమాన అవకాశాలు కల్పించడాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కుటుంబ నియంత్రణకు సంబంధించి పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించడంతో పాటు మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివాహ వయస్సు, కుటుంబ నియంత్రణపై అవగాహన పెంచాలన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి వివరించాలన్నారు. వేసక్టమి, ట్యూబెక్టమీ ఆపరేషన్ల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ కొండయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, జిల్లా గణాంక అధికారి కళాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రాల పరిశీలన



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు

బత్తలపల్లి/ధర్మవరం అర్బన్: ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుతున్న భవిత కేంద్రాలను సమగ్రశిక్ష రాష్ట్ర అధికారుల బృందం పరిశీలించింది. గురువారం బత్తలపల్లిలోని భవిత కేంద్రానికి సమగ్రశిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఆనందబాబు, రాష్ట్ర సమగ్రశిక్ష అబ్జర్వర్లు దండేపాల్, రామ్ కమల్, మనోజ్ తదితరులు విచ్చేశారు. భవిత కేంద్రంలోని 18 మంది ప్రత్యేక అవసరాల పిల్లల విద్యాస్థితిని, పిల్లలకు సంబంధించిన రికార్డులను, కేంద్రం నిర్వహణను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.ప్రత్యేక అవసరాల పిల్లలకు అందిస్తున్న విద్యాబోధన గురించి ఐఈఆర్పీలు ప్రసాద్, ఖాదిరెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలు పాడిన పాటలు విని సంతృప్తి చెందారు. పిల్లలు వివిధ ఆటలలో సాధించిన మెడల్స్ గురించి తెలుసుకొని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ప్రత్యేక అవసరాల పిల్లలకు మంజూరైన స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అంతకుముందు ధర్మవరం పట్టణంలోని ప్రత్యేక అవసరాల పిల్లల భవిత సెంటర్‌ను వారు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు సుధాకర్‌నాయక్, రాజేశ్వరిదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, సీఆర్పీలు సునీత, వెంకటరమణ, గోవిందరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఇంటర్ మార్కుల జాబితాలు

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి, మేలో జరిగిన ఇంటర్ వార్షిక పరీక్షలు, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన ద్వితీయ సంవత్సరం విద్యార్థుల మార్కుల జాబితాలో అందుబాటులో ఉన్నాయని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఇంటర్ బోర్డు నుంచి ఒరిజినల్ మార్కుల జాబితాలు ఆర్ఐఓ కార్యాలయాలకు చేరాయన్నారు. శుక్రవారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వచ్చి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. మార్కుల జాబితాలు పొందేందుకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ తప్పనిసరిగా అనుమతిపత్రం పంపాలని స్పష్టం చేశారు. ఆయా విద్యార్థులకు వెంటనే అందజేసేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్లుప్తంగా

మృత్యువులోనూ వీడని బంధం



కిష్టప్ప, లక్ష్మీదేవి (ఫైల్)

గోరంట్ల: వివాహ బంధంతో ఒక్కటైన వారి బంధం జీవన పయనంలోనూ అంతే అనుబంధంగా సాగింది. పెళ్లి సమయంలో నాతి చరామి అంటూ జీవితాంతం కలసి ఉంటామని ప్రమాణం చేసిన ఆ వృద్ధ దంపతుల బంధం మృత్యువులోనూ వీడలేదు. అనారోగ్యంతో బాధపడుతూ గంటల వ్యవధిలోనే ఇద్దరూ మృతి చెందారు. వివరాలు.... గోరంట్ల మండలం మందలపల్లికి చెందిన వడ్డే కిష్టప్ప (70), లక్ష్మీదేవి (58) దంపతులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధి నయం కాక గురువారం ఉదయం 6 గంటలకు కిష్టప్ప మృతి చెందాడు. క్యాన్సర్‌తో బాధపడుతున్న లక్ష్మీదేవి సైతం 11 గంటలకు మృతి చెందింది. కేవలం ఐదు గంటల వ్యవధిలోనే దంపతులిద్దరూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

లాభసాటిగా ప్రకృతి వ్యవసాయం



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

హిందూపురం అర్బన్: ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తే పంటల సాగులో లాభాలు గడించవచ్చునని రైతులకు జిల్లా రీసోర్స్ కేంద్రం ఏడీఏ.సనావుల్లా సూచించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువులను వాడితే పెట్టుబడులు తగ్గుతాయన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏఏ పంటలు సాగు చేయాలో అంశంపై గురువారం పూలకుంట గ్రామ రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. అనంతరం పూలకుంటకు చెందిన రైతు నాగిరెడ్డి సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంటకు ఆశించిన కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 200 లీటర్ల నీటిలో ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాముల లేదా స్పైనో షాట్ 60 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు శశిధర్‌రెడ్డి, సురేంద్రనాయక్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కరుణించిన తుంగభద్ర



వరదనీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం



ఆయకట్టులో పెరుగుతున్న వరి నార్లు

- హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీలు
- తాగు, సాగు నీటికి తప్పిన ముప్పు
- ఆయకట్టు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఇప్పటి వరకూ 25.173 టీఎంసీల నీరు చేరిక
- 20,285 క్యూసెక్కులతో కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాయదుర్గం: దాదాపు నెల రోజుల క్రితం వరకూ తీవ్ర వర్షాభావంతో బోసిపోయిన తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం) ఒక్కసారిగా కరుణించింది. జలాశయం ఉపరితలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రజల జీవనాడిగా ఉన్న టీబీ డ్యాం జలకళను సంతరించుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 105.788 టీఎంసీలు కాగా, 20,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో గురువారం నాటికి 27.330 టీఎంసీలకు చేరుకుంది. జలాశయం నుంచి 12,548 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే జలాశయానికి 15 టీఎంసీలకు పైగా వరద చేరడం విశేషం.

172 టీఎంసీల లభ్యత..

తుంగభద్ర జలాశయం ఉపరితలంలోని శివమొగ్గ, ఆగుంబె, తీర్థహళ్లి, సాగర, హొసనగర, కడూరు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అప్పర్ భద్ర గేట్లను అధికారులు ఎత్తి నీటిని దిగువకు వదిలడంతో టీబీ డ్యాంకు వరద పోటెత్తింది. ఈ ఏడాది జలాశయానికి 172 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని అధికారులు వేసిన అంచనాలు ఫలించేలా కనిపిస్తున్నాయి. దీంతో హెచ్చెల్సీ వాటాగా 26.36 టీఎంసీలు కేటాయించారు. ఈ నీటితో కనీసం లక్ష ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశముందని అధికారుల అంచనా.

ఖరీఫ్ పనుల్లో నిమగ్నం..

హెచ్చెల్సీ పరిధిలో మొత్తం 2.85 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. నెల రోజుల క్రితం వరకూ టీబీ డ్యాంకు నీటి లభ్యత లేదని తెలుసుకున్న ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నారు. అయితే అనూహ్యంగా టీబీ డ్యాం జలకళను సంతరించుకోవడంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో తలమునకలయ్యారు. హెచ్చెల్సీ ఎగువ ప్రాంతాల్లోని రైతులు బోర్ల ఆధారంగా వరి నారు పెంపకాన్ని చేపట్టారు. ఆయకట్టుకు నీరు వదలగానే నాట్లు వేసేందుకు అన్ని వనరులూ సిద్ధం చేశారు.

టీబీ డ్యాంలో 27 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయంలో 105.788 టీఎంసీలకు గాను 27.330 టీఎంసీల నీరు చేరింది. జలాశయానికి ఎగువన విస్తారంగా వర్షాలు కుస్తుండటంతో తుంగభద్రకు భారీగా వరద వచ్చి చేరుతోంది. గత ఏడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1,581.82 అడుగులతో 5.419 టీఎంసీలతో 17,761 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి 265 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

ఆశాజనకంగా వరద

తుంగభద్ర డ్యాంలోకి ఆశాజనకంగా వరద వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి కేవలం 3 టీఎంసీలు మాత్రమే ఉండేవి. జలాశయం ఉపరితలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తుండడంతో డ్యాం లోకి ప్రస్తుతం 20,285 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుంది. ఈ ప్రవాహం ఇలాగే కొనసాగితే ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందించవచ్చు.

– రమణారెడ్డి, హెచ్చెల్సీ ఈఈ, అనంతపురం

కన్నతల్లిపై కత్తితో దాడి

- విషయం తెలుసుకుని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న రెండో కుమారుడు



బాధితురాలు లక్ష్మీదేవి

శెట్టూరు/కుందుర్పి: కన్నతల్లిపై పెద్ద కుమారుడు కత్తితో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న రెండో కుమారుడు తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం ముచ్చర్లపల్లికి చెందిన లక్ష్మీదేవి భర్త కొన్నేళ్ల క్రితమే మరణించాడు. ఈ క్రమంలో తన ఇద్దరు కుమారులను ఆమె పెంచి పెద్ద చేసి, ఇద్దరికీ పెళ్లిళ్లు చేసింది. కుందుర్పి మండలం కలిగొలిమి గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకున్న రెండో కుమారుడు రాజు... ఎనిమిదేళ్లుగా భార్యతో కలసి కలిగొలిమి గ్రామంలోనే నివాసముంటున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు శివరాజ్‌తో కలసి తల్లి స్వగ్రామం ముచ్చర్లపల్లిలోనే నివాసముంటోంది. అప్పుడప్పుడు ముచ్చర్లపల్లిలో ఉన్న తల్లి లక్ష్మీదేవి వద్దకు చిన్నకుమారుడు వచ్చి పలకరించి వెళ్లేవాడు. శివరాజ్ మద్యానికి బానిసగా మారి కుటుంబ బాగోగులు పట్టించుకోకపోవడంతో ఆయనను వద్దనుకుని భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తాగుడు మానేయాలని పలుమార్లు తల్లి లక్ష్మీదేవి ప్రాధేయపడినా వినేవాడు కాదు. బుధవారం అర్ధరాత్రి పీకల దాక మద్యం తాగి ఇంటికి చేరుకున్న కుమారుడిని తల్లి మందలించింది. తాగుడు మానేసి ఏదైనా పనీపాట చూసుకోవాలని హితవు పలికింది. దీంతో ఆవేశానికి లోనైన శివరాజ్ చేతికి అందుబాటులో ఉన్న కత్తితో తల్లి గొంతుపై దాడి చేశాడు. ఆ సమయంలో ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని కాపాడారు. అప్పటికే కత్తి పోటు కారణంగా గొంతుపై తీవ్రగాయమైన లక్ష్మీదేవిని వెంటనే కళ్యాణదుర్గంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాంభూపాల్ గురువారం ఉదయం కేసు నమోదు చేసి, శివరాజ్ కోసం గాలింపు చేపట్టారు.

తీవ్ర మనోవేదనతో అఘాయిత్యం..

తల్లిపై అన్న కత్తితో దాడి చేసిన విషయం గురువారం ఉదయం తెలుసుకున్న కలిగొలిమిలోని రాజు (29) తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. తమ బాగోగులు చూసేందుకు తల్లి పడిన కష్టం తలుచుకుని కుమిలిపోయాడు. తల్లిలేని జీవితం వ్యర్థమని భావించిన రాజు... విరక్తితో గురువారం ఉదయం కలిగొలిమి గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య శిల్ప, ఇద్దరు చిన్నపిల్లలు బోరున విలపించారు. ఈ ఘటనపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మహిళా డిగ్రీ కళాశాలను పరిశీలించిన 'న్యాక్'



కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న న్యాక్ బృందం సభ్యులు

హిందూపురం టౌన్: స్థానిక ఎన్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను న్యాక్ పీర్ బృందం సభ్యులు గురువారం సందర్శించారు. బృందం సభ్యులు డాక్టర్ ఆర్ముగం, మానస్ పాండే, పద్మ... కళాశాలలోని అన్ని విభాగాలలో అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, కో–కరికులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ కార్యకలాపాలను పరిశీలించారు. అలాగే విద్యార్థినులు, పూర్వ విద్యార్థినులు, తల్లిదండ్రులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ సమన్వయకర్తలతో పాటు వివిధ విభాగాల అధిపతులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత ఐదేళ్లలో కళాశాల అభివృద్ధిని కమిటీ సభ్యులకు వివరించారు. కళాశాలలోని ప్రయోగశాలలు, గ్రంథాలయం, జిమ్, కార్యాలయం, హాస్టల్ ఇతర వసతులు, సౌకర్యాలను పరిశీలించడంతో పాటు సాయంత్రం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు, యుద్ధ విన్యాసాలు, యోగా సాధనను తిలకించారు. శుక్రవారం కూడా పరిశీలన కొనసాగనుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి, కళాశాల కమిషనరేట్ తరఫున అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్ రెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తరఫున ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఈటీ రామ్మూర్తి, సుదర్శన్, అనూష, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేసు, భోజప్ప, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీదానిపల్లిలో ఇరువర్గాల ఘర్షణ



ఓ వర్గంపై దూసుకెళుతున్న మరో వర్గం



దిబ్బను తొలగిస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని బీదానిపల్లిలో ఎరువు దిబ్బలు తొలగించే విషయంగా టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ప్రభుత్వ ఖాళీ స్థలంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎరువు దిబ్బలు ఏర్పాటు చేసుకున్నారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకున్నా టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో దిబ్బలు ఖాళీ చేయాలని రైతులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అంతటితో ఆగకుండా గురువారం జేసీబీ సాయంతో దిబ్బలు తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో అడ్డుకోబోయిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై టీడీపీ నాయకులు విరుచుకుపడ్డారు. పరస్పర దాడులతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

ప్రతి పాఠశాలలో స్కౌట్స్ ఏర్పాటు



డీఈఓ కార్యాలయ సిబ్బందితో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం అధికారులు

పుట్టపర్తి అర్బన్: విద్యాశాఖ సహకారంతో ప్రతి పాఠశాలలోనూ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్రస్థాయి గైడ్స్ జోనల్ అధికారి ఉమాదేవి తెలిపారు. గురువారం కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే శిక్షణా కార్యక్రమాలపై పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు అవగాహన కల్పించి, సమాజాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలపై పూర్తి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ కోసం భవన నిర్మాణానికి తోడ్పాటునందించాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, నాగరాజు, లాజర్, సెక్రెటరీ భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి గిరిధర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజగుప్తా, ఫణిభూషణరావు, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన డిప్లొమో విద్యార్థినులు

అనంతపురం: న్యూఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) మంజూరు చేస్తున్న ప్రగతి మెరిట్ స్కాలర్‌షిప్‌కు అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు అర్హత సాధించారు. అర్హత సాధించిన వారిలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు కె.జోషిత, పి.మౌనిక, కేఎం నందిని, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ విభాగంలో కె.నవ్యశ్రీ, జి.హర్షిణి, వి.మహాలక్ష్మి, బి.శ్రేయ, సివిల్ బ్రాంచ్‌లో నందిని, ఎస్.మీనాక్షి ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50 వేలు చొప్పున మూడేళ్ల కోర్సు పూర్తి అయ్యే వరకూ స్కాలర్‌షిప్‌ను ఏఐసీటీఈ అందజేయనుంది. ప్రతిభ చాటిన విద్యార్థినులను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి, ఆటోమొబైల్ విభాగాధిపతి ఎన్.శ్రీనివాసరావు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి అభినందించారు.

సంజీవరాయునిపల్లిలో చోరీ

చిలమత్తూరు: మండలంలోని సంజీవరాయునిపల్లిలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నాగరాజు చిలమత్తూరులో టీస్టాల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ ఇంటికి తాళం వేసి వ్యాపార లావాదేవీలు ముగించుకుని వచ్చేవాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి చిలమత్తూరుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి చేరుకుని చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలిస్తే బీరువాలో ఉంచిన రూ.20 వేల నగదు, 6 గ్రాముల బంగారు ఉంగరాన్ని దుండగులు అపహరించుకెళ్లినట్లు గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మంగళవారం మరవకొత్తపల్లి బీసీ కాలనీలో శంకరరెడ్డి ఇంట్లో బంగారం చోరీ ఘటన మరువకన వరుసగా మరో చోరీ జరగడం కలకలం రేపుతోంది.

పేదలకు ఇంటి స్థలం ఇచ్చే వరకూ పోరాటం



భూ ఆక్రమణకు ర్యాలీగా వెళుతున్న సీపీఐ నాయకులు, పేదలు

- దేవుని మాన్యంలో జెండాలు పాతిన సీపీఐ నేతలు

బత్తలపల్లి: నివేశన స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో పేదలు గురువారం ఉద్యమించారు. వివరాలు.. బత్తలపల్లిలోని నిడిమామిడి దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబర్ 401లోని దాదాపు 20 ఎకరాల భూమి ఇతరుల ఆధీనంలో ఉంది. ఈ భూమిని ఆక్రమించి ఇంటి స్థలాలు లేనివారికి పంపిణీ చేస్తామని సీపీఐ ప్రకటించడంతో మండల వ్యాప్తంగా వందలాది మంది పేదలు తరలివచ్చారు. మాన్యం భూమిలో సీపీఐ రాష్ట్ర, జిల్లా, మండల నేతల సమక్షంలో జెండాలు పాతి ఆక్రమించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి మధు మాట్లాడారు. మాన్యం భూమిని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయించి, పక్కా గృహ నిర్మాణాలు చేపట్టడంతో పాటు మౌలిక వసతులు కల్పించేవరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు. తాము నిడిమామిడి పీఠాధిపతిని సంప్రదించగా తమ దేవస్థానానికి సంబంధించిన భూములను ఎవరికీ విక్రయించలేదన్నారు. ఆ భూమిని పేదల నివేశస్థలాలకు ఇచ్చేందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో తామే భూ ఆక్రమణకు పాల్పడాల్సి వచ్చిందన్నారు. ఈ భూమి పేదలకు దక్కేంత వరకూ ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని, భూ కబ్జాదారులకు సెంటు భూమి కూడా దక్కనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ అనుబంధ చేనేత సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, బత్తలపల్లి, ముదిగుబ్బ మండల సీపీఐ కార్యదర్శులు బండల వెంకటేష్, శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాల్యవంతం కుళ్లాయప్ప, పోట్లమర్రి నాగభూషణ, వందలాది మంది పేదలు పాల్గొన్నారు.

జనసేన నాయకుల బాహాబాహీ

పెనుకొండ: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లిలో జనసేన నాయకులు బుధవారం రాత్రి బాహాబాహీగా తలపడ్డారు. వివరాలు... జనసేన పార్టీ పెనుకొండ పట్టణాధ్యక్షుడు లోకేష్, ఉపాధ్యక్షుడు సురేష్ మధ్య కొంత కాలంగా విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఇద్దరూ వాగ్వావాదానికి దిగారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి చివరకు పరస్పరం దాడి చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ ప్రస్తుతం హిందూపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై స్టేషన్ హౌస్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ.. ఇద్దరూ ఘర్షణ పడ్డారే తప్ప పెద్ద ప్రమాదమేమీ జరగలేదన్నారు. పాత కక్షల నేపథ్యంలోనే గొడవ జరిగిందన్నారు. కాగా, విషయం తెలియగానే వెంకటరెడ్డిపల్లిలో గురువారం ఉద్రిక్తత నెలకొంది.

పెళ్లి మాటున వంచన..

- యువకుడి మాయలో మోసపోయిన పాడేరు యువతి
- అవసరం తీరాక అజ్ఞాతంలోకి వెళ్లిన గుంతకల్లు ప్రేమికుడు
- న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదన్న బాధితురాలు



మోసపోయిన నందిని

గుంతకల్లు రూరల్: ప్రేమ పేరుతో నమ్మించాడు... పెళ్లి చేసుకుంటానని రప్పించాడు... శారీరక అవసరం తీరాక అజ్ఞాతంలోకి వెళ్లాడు. 875 కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చిన యువతి నిస్సహాయ స్థితిలో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు నందిని తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే...

ఫోన్ కాల్ పరిచయం...

మాది అల్లూరి సీతారామారాజు జిల్లా పాడేరు గ్రామం. నా చిన్నప్పుడే నాన్న చనిపోయాడు. అమ్మ కౌసల్య కూలి పనులతో నన్ను పదో తరగతి వరకూ చదివించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చదువు మానేసి, కూలి పనులతో అమ్మకు చేదోడుగా ఉంటూ వచ్చాను. సరిగ్గా ఆరేళ్ల క్రితం నా సెల్‌ఫోన్‌కు ఓ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు స్వామి అని తెలిపాడు. పొరపాటున కాల్ వచ్చిందని తెలిపాడు. దీంతో రాంగ్ నంబర్ అని తెలుసుకుని ఇద్దరమూ ఫోన్ కట్ చేశాం. అయితే అక్కడితో ఆయన ఆగలేదు. అప్పుడప్పుడు ఫోన్ చేసి పలకరించేవాడు. ఆ పరిచయం మా మధ్య ప్రేమకు దారి తీసింది. రాను రాను ఫోన్‌లో గంటల తరబడి అర్ధరాత్రి వరకూ మాట్లాడుకునేవాళ్లం. ఒకరి ఫొటోలు మరొకరు షేర్ చేసుకున్నాం. వీడియో కాల్స్‌తో మరింత దగ్గరయ్యాం.

తనకు పెళ్లయిందన్నాడు..

మా పరిచయం ప్రేమగా మారిని కొన్నాళ్లకు స్వామి తనది అనంతపురం జిల్లా గుంతకల్లు అని తెలిపాడు. ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నట్లుగా, తనకు ఇదివరకే పెళ్లి అయిందని... భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పాడు. దీంతో ఒక్కసారిగా నివ్వెర పోయాను. పెళ్లి అయి ఉండి ప్రేమ పేరుతో నాకెందుకు దగ్గరయ్యావని ప్రశ్నించా. ఈ విషయం మొదట్లోనే చెబితే ఎక్కడ దూరం అవుతావోనని భయంతో చెప్పలేదన్నాడు. రోజూ నాతో మాట్లాడకపోతే బతకలేనని, తనను నమ్మాలని ప్రాధేయపడ్డాడు. చాలామంది రెండేసి పెళ్లిళ్లు చేసుకుంటున్నారని, అలాగే నన్నూ రెండో పెళ్లి చేసుకుంటానన్నాడు. ప్రాధేయపడ్డాడు. ఆయన మాటలు నమ్మాను.

పెళ్లి చేసుకుంటానంటే వచ్చా..

కొన్ని రోజుల క్రితం పెళ్లి ప్రస్తావన లేవనెత్తాను. అయితే అంత దూరం తాను రాలేనని, నన్నే గుంతకల్లుకు రమ్మని చెప్పాడు. ఒక్కదాన్నే అంతదూరం రావడం ఎలా? అని ఆందోళనతో అడిగా. చదువుకున్నదానివి ఆ మాత్రం రాలేవా? అంటూ ధైర్యం చెప్పాడు. అన్ని విధాలుగా తోడుంటానన్నాడు. దీంతో ధైర్యం చేసి ఈ నెల 9న పాడేరులో బయలుదేరి మరుసటి రోజు కర్నూలుకు చేరుకున్నా. అప్పటికే అక్కడ నా కోసం స్వామి ఎదురు చూస్తూ ఉన్నాడు. తర్వాత ఇద్దరమూ కలసి గుంతకల్లుకు చేరుకున్నాం. గుంతకల్లు పట్టణ శివారులోనే కసాపురం రోడ్డు సమీపంలో స్వామి అప్పటికే తీసి ఉంచిన ఖాళీగా ఉన్న గదికి చేరుకున్నాం. మరుసటి రోజు పెళ్లి చేసుకునేందుకు ఏర్పాట్లు చేశానని చెప్పడంతో నా ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఆ సమయంలోనే స్వామి మాయ మాటలతో నన్ను లోబర్చుకున్నాడు.

అవసరం తీరాక వెళ్లిపోమ్మన్నాడు..

తన శారీరక అవసరం తీరాక స్వామి అసలు రూపం బయట పెట్టాడు. నన్ను మా ఊరికి వెళ్లిపోవాలన్నాడు. నేను కాదూకూడదన్నాను. పెళ్లి చేసుకుంటానంటే ఇంత దూరం వచ్చానన్నా. ఇప్పుడు అవసరం తీరాక నన్ను వదిలించుకోవాలనుకుంటే తాను ఊరుకునేది లేదని చెప్పా. జీవితమంతా ఇక్కడే ఉంటానని, ఎలాంటి పరిస్థితుల్లోనూ పెళ్లి కాకుండా ఊరికి వెళ్లేది లేదని చెప్పాను. దీంతో కాసేపు స్వామి మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అలా బయటకు వెళ్లి తినేందుకు ఏదైనా తీసుకువస్తానని చెప్పి వెళ్లాడు. బుధవారం సాయంత్రం నన్ను గదిలో వదిలేసి వెళ్లినోడు గురువారం ఉదయం వరకూ తిరిగి రాలేదు. దీంతో నన్ను స్వామి మోసం చేశాడని తెలుసుకుని కుమిలి పోయాను. విషయాన్ని కసాపురం పోలీసులకు తెలిపి నాకు న్యాయం చేయాలని కోరాను. నాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడి నుంచి నేను పోను.

విచారణ చేస్తున్నాం

బాధితురాలు నందిని చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నాం. యువతిని వదిలి వెళ్లిన స్వామికి ఫోన్ చేసి స్టేషన్‌కు రప్పించే ప్రయత్నం చేస్తున్నాం. ఆయన రాగానే పూర్తి వివరాలు విచారణ చేసి సరైన చర్యలు తీసుకుంటాం.

– దుగ్గిరెడ్డి, ఎస్‌ఐ, కసాపురం పోలీస్ స్టేషన్

'అనంత'లో రేపు జగన్నాథ రథయాత్ర

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా శనివారం ఉదయం పూరీ జగన్నాథ రథయాత్ర జరగనుంది. ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ మేరకు ఇస్కాన్ అనంతపురం శాఖ చైర్మన్ దామోదర గౌరంగదాసు గురువారం వెల్లడించారు. ప్రపంచ శాంతిని సాధించే దిశగా ఇస్కాన్ భక్తిమార్గం పయనియస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. సమాజాన్ని అంతటినీ ఏకం చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాల పరంపర ద్వారా జ్ఞాన ప్రచారం, వసుధైక కుటుంబ నిర్మాణమే ఇస్కాన్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ క్రమంలో ఏటా అనంతపురంలో పూరీ జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. గతంలో కంటే ఈసారి రెట్టింపు స్థాయిలో అనంత ఖ్యాతిని చాటేలా రథయాత్ర కొనసాగుతుందన్నారు. ఆధ్యాత్మిక వేడుకలో భాగస్వాములు కావాలని కోరారు.

రథయాత్ర సాగుతుందిలా..

కళాజాత, ఆధ్యాత్మిక ప్రవచనాలు, వేద పఠనం నడుమ జగన్నాథ రథయాత్ర రెండు రోజుల పాటూ అంగరంగ వైభవంగా జరుగుతుంది. అందులో భాగంగా తొలిరోజు శనివారం మధ్యాహ్నం 4 గంటలకు అనంతపురంలోని కేఎస్‌ఆర్ కాలేజ్ సమీపంలో మహాఅభిషేకంతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. అక్కడ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం, సుభాష్‌రోడ్, టవర్‌క్లాక్, రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్, గాంధీబజార్, పాతూరు బసవన్నకట్ట మీదుగా మళ్లీ సప్తగిరి సర్కిల్ ఆపైన నేరుగా ఇస్కాన్ మందిరానికి రథయాత్ర చేరుకుంటుంది.